సలీం

# నూటికి నూరు మార్కులు

కథ

పొద్దుగంట నించి నా ఎదురుగా తల వొంచుకుని కూచుని ఉన్నాడు అమిత్. వాడికి పదిహేడేళ్ళు దాటినా నా కంటికి పసిపిల్లాడిలానే కన్పిస్తున్నాడు. నాలుగేళ్ళప్పుడు యల్కేజిలో మార్కులు బాగా రాలేదని వాళ్ళమ్మ తిట్టినప్పుడు అచ్చం యిలానే నా ఎదురుగా తల వొంచుకుని కూచున్న జ్ఞాపకం. అప్పుడు వాడి వెడల్పాటి, అందమైన కళ్ళనిండా గుండ్రటి, తెల్లటి నీటి ముత్యాలు... పొడవాటి సరాలుగా మారి బుగ్గల మీంచి జారుతూ... గులాబీ రెక్కల్లా ఎరుపెక్కిన చెక్కిళ్ళు... వాణ్ని ఎత్తుకుని ముద్దాడి నా భార్యని మందలించిన గుర్తు.



'యల్కేజి మార్కులకే యింత రాద్ధాంతం చేస్తావెందుకు? చిన్న పిల్లాణ్ని పట్టుకుని అంతంత మాటలనటం భావ్యం కాదు సుజీ. చదువుతాడ్లే. ఏరా నాన్న... బాగా చదివి టెన్త్‌లో స్కూల్ ఫస్ట్ తెచ్చుకోవాలి. యింటర్లో యంసెట్ రాసి మంచి ర్యాంక్ తెచ్చుకుని, యింజనీరై నా పేరు నిలబెట్టాలి. సరేనా?' అన్నాను.

వాడు తన విశాలమైన కనురెప్పల్ని ఎత్తి నా వైపు చూస్తూ, 'అలాగే నాన్నా' అన్నాడు.

'ఆ... యిలానే వాడ్ని ముద్దు చేసి పాడు చేయండి. నిలబెట్టేది మన పేరు కాదు. మనల్ని నడిబజార్లో నిలబెట్టకుండా ఉంటే చాలు' అంటూ సుజాత కసురుకుంది.

యిపుడు అచ్చం అలానే... నా ఎదురుగా... అపరాధిలా... ఎటొచ్చీ అప్పటిలా కన్నీళ్ళు లేవు... కానీ మొహం నిండా అనంతమైన దిగులు దట్టంగా పర్చుకుని...

ఈ అపరాధం వాడిదా లేక నాదా... నిజంగా ముద్దు చేసి పాడు చేశానా...బెత్తం పట్టుకోనివాడు మంచి తండ్రి కాలేడని కదా బైబిల్ సూక్తి. నేనెప్పుడూ అమిత్‌ని చదువు విషయంలో కోప్పడలేదు. మార్కులు తక్కువొచ్చినపుడు వాళ్లమ్మలా మందలించలేదు. ఎవరి తెలివికైనా కొన్ని పరిమితులుంటాయని నమ్మినవాడ్ని. వాడి తెలివి అంతే అని సర్ది చెప్పుకున్నాను. యింతకంటే ఎక్కువ మార్కులు వాడికి రావని సమాధానపడ్డాను. సుజాతలా వాడ్ని కోప్పడి, తిట్టి, కొట్టి హింస పెట్టడం వల్ల ప్రయోజనం ఉండదని నాకు తెలుసు.

ఏమో... సుజాత చెప్పినట్లు నాకే సరిగ్గా తెలీదేమో... మొదట్నుంచీ వాడ్ని మందలించి ఉంటే రిజల్ట్ మరోలా ఉండేదేమో. తండ్రి తిడ్తాడేమోనన్న భయంకొద్దీ బాగా చదివేవాడేమో... ఐనా భయంతో చదవడమేమిటి? యిష్టంతో కదా చదవాలి...

నా చిన్నప్పుడు లెక్కలన్నా, సైన్స్ పాఠాలన్నా విపరీతమైన భయం నాకు. ఎంత ప్రయత్నించినా తలకెక్కేవి కావు. తొమ్మిదో తరగతిలో కాంపోసిట్ లెక్కలు తీసుకోనని మారాం చేస్తే నాన్న చింత బరికెతో చావబాదాడు. పదో తరగతి ఫెయిలయ్యాను. యింటర్ కూడా కంపార్ట్‌మెంట్లో పాసై నాన్నని ఎదిరించి బియ్యేలో చేరాను. మరీ బలవంతపెడ్తే యింట్లోంచి పారిపోతానని బెదిరించాను. తెలుగుభాష మీది మమకారంతో యం.ఏ. తెలుగులో చేసి ప్రస్తుతం లెక్చరర్‌గా బతుకుబండి లాగిస్తున్నాను.

నేను మా నాన్నని ఎదిరించి నాకు నచ్చిన సబ్జెక్ట్ చదివినవాడ్ని, యిపుడు నా కొడుకుని బెదిరించి చదివించగలనా... నాకో న్యాయమూ వాడికో న్యాయమా... వీడు ఎనిమిదో తరగతిలో ఉన్నప్పుడు ఓసారి రమణ వాళ్ళింటికెళ్ళా. రమణ నా క్లాస్‌మేట్. యం.యస్సీ చదివాక, న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్‌లో సైంటిస్ట్‌గా పన్చేస్తున్నాడు. నెవెళ్ళేప్పటికే మావాడితో పాటు ఎనిమిదో తరగతి చదువుతున్న వాళ్ళబ్బాయి అనంత్ గోడకుర్చీ వేస్తున్నాడు.

'యిదేమిట్రా... పిల్లాడ్ని యిలా హింసిస్తే చదువొస్తుందా? వాడి మానాన వాడ్ని వదిలేయి. యింకా బాగా చదువుతాడు. పిల్లలు లేత మొగ్గల్లాంటివారు. వాళ్ళని స్వేచ్ఛగా వికసించనీ... బలవంతం చేస్తే విరిగిపోతారు' అన్నాను.

'నీ మొహం... నువ్వు సైన్స్ చదవలేదుగా. అందుకే నీకు తెలీదు. మానవ మేధస్సు చాలా అద్భుతమైంది. దానికున్న అపార శక్తి సామర్థ్యాల్లో మనిషి కేవలం పది శాతాన్ని మాత్రమే వినియోగించుకుంటున్నాడు. మిగతా దాంట్లోంచి కొంతైనా ట్యాప్ చేయాలంటే పిల్లల్ని స్ట్రెచ్ చేయక తప్పదు' అన్నాడు.

ఏమో. రమణ చెప్పిందే కరక్టేమో. అమిత్‌పైన కొంతైనా వత్తిడి పెట్టి ఉంటే యంసెట్లో మంచి ర్యాంక్ వచ్చి ఉండేదేమో.


నేనూ మౌనంగా ఉండటం చూసి అమిత్ తలయెత్తి నా వైపు చూసాడు. వాడి కళ్ళలో తడి...

"సారీ నాన్నా... పరీక్ష బాగానే రాసాను. ర్యాంకిలా వస్తుందనుకోలేదు" అన్నాడు.

సుజాత విసురుగా వచ్చింది. "హవ్వ. అసలేమైనా ర్యాంకా అది. సిగ్గులేదట్రా... నలభై రెండువేలపైన ర్యాంక్... పరీక్ష బాగా రాస్తే మార్కులిలా ఎందుకేడుస్తాయి? అంతా మా ఖర్మ. అసలీయన్ననాలి. పిల్లాడు ఏం చదువుతున్నాడో, ఎన్ని మార్కులు తెచ్చుకుంటున్నాడో పట్టించుకున్న పాపాన పోయాడా? అందరూ ఈయన్లా ఉంటారా? ఆ రమణగారు చూడు పిల్లాడ్ని ఎంత శ్రద్ధగా చదివిస్తారో... నా ఖర్మ" అంది.

యి. యిప్పుడంత అయిపోయిన ర్యాంకు మారదుగా. మంచి కాలేజీలో ఫ్రీ సీటు రావాలంటే ఐదు వేల లోపలే ర్యాంకు రావాలి. అలా జరగనప్పుడు పది వేల ర్యాంకు వచ్చినా ఒక్కటే, లక్ష పైన ర్యాంకు వచ్చినా ఒక్కటే. యింటర్లో మంచి మార్కులు తెచ్చుకున్నాడుగా. యంసెట్లో క్వాలిఫై ఐనాడు. చాల్లే సంతృప్తి పడు" అన్నాను.

"మీరు పడండి ఆ సంతృప్తి ఏమిటో...



నేను వాడింటికెళ్ళినపుడు ఎంత దుఃఖంతో వెళ్ళానో తిరిగొచ్చేటప్పుడు దానికి రెండింతల దుఃఖాన్ని మోసుకుంటూ వచ్చాను. వాడికేం... కావాల్సినంత డబ్బుంది. పది కాకపోతే పదిహేను లక్షలు కట్టగలడు. నాకంత తాహతెక్కడిది?

మీరు కాదూ వాడ్ని పాడు చేసింది! అనుభవించండి. చేసుకున్నవాళ్ళకి చేసుకున్నంత మహాదేవ" అంది అంతే విసురుగా లోపలికి పోతూ.

"సారీ నాన్నా!" అన్నాడు అమిత్. అలా అనటం అది నాలుగోసారి.

"పోన్లే నాన్న. నువ్వు దిగులు పడకు" అన్నాను వాడ్ని బుజ్జగిస్తూ... సుజాత బైటికొచ్చి నా వైపు కొరకొరా చూసి మళ్ళా లోపలికెళ్ళిపోయింది.

"సారీ నాన్నా" అన్నాడు అమిత్.

"ఎన్నిసార్లు సారీ చెప్తావు? నాకు నచ్చని పదం అదని నీకు తెల్సుగా. నిజంగా తప్పు చేస్తే నిజాయితీగా పశ్చాత్తాపపడితే చాలు. సారీ అనే రెండక్షరాల పదం పాప ప్రక్షాళన చేసే అద్భుతమంత్రం కాదు. యింగ్లీష్ వచ్చినవాళ్ళు వాడే అర్థరహితమైన వూత పదం. పోనీలే... వదిలెయ్. వెళ్ళి భోంచేయి" అన్నాను.

"ఆకలిగా లేదు నాన్నా" అంటూ వాడు లేచి గదిలోకెళ్ళి పడుకున్నాడు.

లేచి చొక్కా వేసుకుని రమణ యింటికెళ్ళాను. నేను వెళ్ళేటప్పటికి డైనింగ్ టేబిల్ దగ్గర కూచుని భోజనాలు చేస్తున్నారు.

"రారా... మాతో కలిసి భోంచేస్తావుగాని" అన్నాడు రమణ.

"లేదురా. యిప్పుడు ఆకలిగా లేదు" దగ్గర కూచుంటూ.

"టైం ఎనిమిదిన్నర దాటింది. ఆకలి లేదంటావేమిట్రా? యింతకూ మీ వాడికి ర్యాంక్ ఎంతొచ్చింది?"

"నలభైరెండు వేల పైనే. ఆ విషయం మాట్లాడటానికే వచ్చాను" అన్నాను దిగులుగా.

రమణ పెద్దగా నవ్వాడు. "ఛీరప్ మ్యాన్. నా కొడుక్కి అరవై ఎనిమిది వేల తొమ్మిది వందల్లో వచ్చింది ర్యాంక్. వాడు బాగా చదవాలని తీస్కెళ్ళి చైతన్య హాస్టల్లో వేసి మరీ చదివించా. ఏం ప్రయోజనం? బుర్రలో సరుకుండాలిగా. నువ్వు చెప్పిందే కరెక్ట్‌రా. గుర్రాన్ని చెరువు దాకా లాక్కెళ్ళగలంగాని బలవంతంగా నీళ్ళు తాగించలేమని తెల్సుకున్నాను".

"మరిప్పుడేం చేద్దామనుకుంటున్నావు?"

"ఏముంది... మేనేజిమెంట్ కోటానే. వీడు ఇసిఇ చేస్తానంటున్నాడు. మన హైద్రాబాద్‌లో ఉన్న యింజనీరింగ్ కాలేజీల్లో దిబెస్ట్ బి.బి.ఐ.టి. కాలేజీనే. అందులో చేర్పించేస్తా".

"ఆ కాలేజీలో డొనేషన్ ఎక్కువుంటుందట కదా"

"నిజమే. ఇసిఇ కయితే పదో పన్నెండో లక్షలుంటుంది".

"అమ్మో... అంత డబ్బా... దాంతోపాటు ప్రతి సంవత్సరం ఫీజుకింద తొంభై రెండు వేలు కట్టాలిగా".

"తప్పదు. ఏం చేస్తాం చెప్పు. పిల్లలకు మంచి చదువు చెప్పించటం కాదిప్పుడు... కొనివ్వడమే" అన్నాడు చేయి కడుక్కుంటూ.

నేను వాడింటికెళ్ళినపుడు ఎంత దుఃఖంతో వెళ్ళానో తిరిగొచ్చేటప్పుడు దానికి రెండింతల దుఃఖాన్ని మోసుకుంటూ వచ్చాను. వాడికేం... కావాల్సినంత డబ్బుంది. పది కాకపోతే పదిహేను లక్షలు కట్టగలడు. నాకంత తాహతెక్కడిది?

గతేడాది అమ్మాయికి పెళ్ళి చేసి పంపించాను... దానికోసం చేసిన నాలుగు లక్షల అప్పుకి యింకా వడ్డీ కడ్తున్నాను. నేనంత డబ్బు పెట్టి చదువుల్ని కొనలేను. యింజనీరింగే చదవాలా? అదొక్కటేనా చదువు? డిగ్రీ చదువు కాదా? మేమందరం డిగ్రీలు చదివేగా ఉద్యోగాలు తెచ్చుకున్నాం. యింజనీరింగ్ చదవటమనేది ఓ వేలం వెర్రిలా తయారైంది. ముఖ్యంగా మన ఆంధ్రప్రదేశ్‌లో. ఏ రాష్ట్రంలో లేనన్ని యింజనీరింగ్ కాలేజీలు యిక్కడ పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి.

ఆ రాత్రి అన్నం సయించలేదు. నిద్ర పట్టలేదు.

మరునాడు కాలేజీకెళ్ళే ముందు అమిత్‌ని దగ్గర కూచోబెట్టుకుని, "యిపుడు ఏం చదవాలనుకుంటున్నావు?" అని అడిగా.

"యింజనీరింగ్‌లో చేర్తాను నాన్నా. నా ఫ్రెండ్సందరూ భవ్యభారతి యింజనీరింగ్ కాలేజీలో చేర్తున్నారట. బి.బి.ఐ.టి. అంటారే... నేనూ అదే కాలేజీలో చేర్తాను. యిప్పుడు కంప్యూటర్ కోర్సుకి అంత డిమాండ్ లేదంటున్నారు. ఇసిఇ మంచిదట. ఎక్కడికెళ్ళినా డిమాండ్ ఉంటుందట. మంచి ఉద్యోగాలు దొరుకుతాయట" అన్నాడు.

నా గుండెల్లో రాయి పడింది. వాడినెలాగైనా బుజ్జగించి, డిగ్రీలో చేరడానికి ఒప్పించాలని నిర్ణయించుకున్నా.

"యింజనీరింగ్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ చదివినవాళ్ళకీ, డిగ్రీలో బి.సి.ఏ చదివినవాళ్ళకి ఉద్యోగావకాశాల్లో పెద్దగా తేడాలు కన్పించటం లేదు. నువ్వు చదవాలనుకున్న ఎలక్ట్రానిక్స్ సబ్జెక్ట్ డిగ్రీలో కూడా దొరుకుతుంది. యింజనీరింగ్ చదువంటే మాటలా చెప్పు... లక్షలకు లక్షలు పోయాలి. నా మాటిని డిగ్రీలో చేరిపో. తర్వాత పీజీ చదివితే మంచి భవిష్యత్తు ఉంటుంది".

వాడు చివ్వున లేచాడు. మొహం కోపంతో ఎర్రగా మారిపోయింది. "నా ఫ్రెండ్సందరూ యింజనీరింగ్‌లో చేరితే నేను డిగ్రీ చదవాలా? చావనైనా చస్తాను కానీ డిగ్రీ చదవను" అన్నాడు.

సుజాత మరింత కోపంగా వాడిని సమీపించింది. "యంసెట్లో ర్యాంకు తెచ్చుకునే తెలివి లేదుగానీ కోపం మాత్రం తాటిచెట్టంత ఎత్తున వస్తుంది. మా దగ్గర డబ్బులు

రాసులు పోసి లేవు నాయనా నిన్ను చదివించడానికి... నోర్మూసుకుని నాన్న చెప్పినట్లు డిగ్రీలో చేరు".

"ఏం అక్క పెళ్ళి కోసం నాన్న లక్షలు ఖర్చు చేయలేదా? నా చదువుకోసం ఆ మాత్రం ఖర్చు పెట్టలేడా... నేనంత కానివాణ్ణయిపోయానా? అసలు నా కోసం మీరింతవరకు ఏం చేశారని?"

వాడి మాటలకు మ్రాన్పడిపోయాను. ఏం చెప్పాలో తెలీని అయోమయంలో పడ్డాను. సుజాత పెద్దగా అరుస్తోంది. వాడూ పెద్దగా అరుస్తున్నాడు. యంసెట్లో మార్కులు సరిగా రాలేదని తిట్టినందుకే కదూ పోయిన సంవత్సరం నా కొలీగ్ రవికుమార్ కొడుకు ఆత్మహత్య చేసుకుంది! నాకు భయమేసింది. సుజాతని ఆపడానికి ప్రయత్నించాను.

వాడు కోపంగా బైటికెళ్ళిపోయాడు. వెళ్ళే ముందు "ఇక ఈ యింటికే రాను" అంటూ వెళ్ళిపోయాడు. వాళ్ళమ్మ "పోరా పో... ఎక్కడికి పోతావో పో... నీ బెదిరింపులకు భయపడ్తాననుకున్నావా" అంటూ అరిచింది గానీ మధ్యాహ్నం వాడు భోజనానికి యింటికి రాలేదని భయపడ్తూ నాకు ఫోన్ల మీద ఫోన్లు చేసింది. ఓ పూట శెలవ పెట్టి యింటికెళ్ళాను. నన్ను చుట్టుకుని వలవలా ఏడ్చింది. "వాడు నిజంగానే ఎటైనా వెళ్ళిపోయాడా? అలా జరిగితే నేను బతకలేనండీ... వాడు నా ప్రాణం. వెతికి పిల్చుకు రండి. మీకు దండం పెడ్తాను" అంది కన్నీటి కాసారంలా మారిపోతూ...

రాత్రి పది దాటాక యింటికొచ్చాడు. అప్పటివరకూ వాడి కోసం కళ్ళలో వత్తు లేసుకుని ఎదురుచూసిన సుజాత... వాడి క్షేమం కోసం వంద దేవుళ్ళకు మొక్కుకున్న సుజాత...వాడ్ని చూడగానే కోపంతో మండిపోతూ కొట్టడానికి చేయెత్తింది. మరుక్షణమే వాడ్ని చుట్టుకుని ఏడుస్తూ, "యింకెప్పుడూ అలా చేయకురా కన్నా. నేను తట్టుకోలేను. నీ యిష్టప్రకారమే చేర్పిస్తాం. తొందరపడి ఏ అఘాయిత్యాలూ చేయకురా" అంది.

మర్నాడు తొందరగా తెమిలి పదింటికల్లా బి.బి.ఐ.టి కాలేజీ చేరుకున్నాను. గేటు దగ్గరున్న వాచ్‌మన్ నా మొహం చూసి పసిగట్టాడో ఏమిటో "యింజనీరింగ్ సీటు కోసమేగా. మెట్లెక్కి ఎడం వైపుకెళ్ళండి. చివరి రూంలో ఛైర్మన్ బి.కె.రెడ్డి గారుంటారు. వారిని కలవండి" అన్నాడు.

నేను వెళ్ళేప్పటికే పాతిక మందిదాకా ఆ గదిలో ఉన్నారు. అక్కడున్న రిసెప్షనిస్ట్ నా చేతిలో ఓ టోకెన్ పెట్టింది. టోకెన్ నంబర్ యాభై నాలుగు. అక్కడ కూచుని ఉన్న వాళ్ళవైపోసారి చూసి మరలా రిసెప్షనిస్ట్ వైపు చూశాను. నా మూగ బాధ అర్థమైనట్లుంది ఓ చిర్నవ్వు విసిరి చెప్పింది. "ఉదయం ఎనిమిది నుండి యింటర్వ్యూలు జరుగుతున్నాయి. ఓ యిరవై మంది సార్‌ని కలిసి వెళ్ళిపోయారు. మిగిలింది వీళ్ళే".

ఖాళీగా ఉన్న ఓ ప్లాస్టిక్ కుర్చీలో కూచున్నాను. ఒక్కొక్కరు లోపలికెళ్తున్నారు. పది నిముషాలు మాట్లాడి బైటికొస్తున్నారు. టోకెన్లు పుచ్చుకుని ఆస్పత్రిలో తన వంతు కోసం ఎదురుచూసే పేషంట్‌లా నేను... ఎదురుచూస్తూ... గంట... రెండు గంటలు... సమయం ఒంటి గంట... కడుపులో మండుతున్న ఆకలి... ఎంతడుగుతాడోనని గుండెల్లో రగులుతున్న దిగులు... యింతటి భారాన్ని మోయగలనా అనే ఆవేదన...

రెండింటికి నాకు పిలుపొచ్చింది. లోపలికెళ్ళంగానే రెండు చేతులు జోడించి నమస్కారం పెట్టాను.అతని చూపు నన్ను శల్య పరీక్ష చేస్తూ... డబ్బులు కట్టగల తాహతుని బేరీజు వేస్తున్నాడేమో...

"ఏ బ్రాంచ్ కావాలి?"

"ఈసిఈ" నీళ్ళు నమిలాను.

"పన్నెండు లక్షలు."

"అంత యిచ్చుకునే స్థోమత లేదండీ" అన్నాను చేతులు నలుముకుంటూ.

"ఓ లక్ష కన్సెషన్ యిస్తాను. అంతకు మించి తగ్గించటం కుదర్దు".

"రెండో మూడో ఐతే ఎలాగోలా సర్దగలను. మీరు పెద్ద మనసు చేసుకుని... మీ మేలు ఎన్నటికీ మర్చిపోను" మాటల్ని సగం మింగి, తలని నేలకి వాల్చి చెప్పాను.



"యిదేమన్నా కూరగాయల బేరమా? రెండు మూడు లక్షలకు సీటిచ్చే కాలేజీలు చాలానే ఉన్నాయి. అక్కడికెళ్ళి ట్రై చేయండి".

"మా వాడు మీ కాలేజీలోనే చదువుతానంటున్నాడు".

"అవ్వా కావాలి బువ్వా కావాలి అంటే ఎలా? మాది సిటీలోనే నంబర్ వన్ కాలేజీ. మీరు కోరుతున్నది నంబర్ వన్ బ్రాంచ్. చాలా డిమాండ్ ఉంది. మీకో వారం టైమిస్తున్నా. ఏ విషయం వచ్చి చెప్పండి" అన్నాడు.

తల వేలాడేసుకుని బైట పడ్డా. స్టార్ హోటల్లో కాఫీ ఆర్డర్ యిచ్చాక దాని రేటు యాభై రూపాయలని తెల్సుకుని నోరెళ్ళబెట్టే... 'మరి యిక్కడికెందుకొచ్చావు నాయనా... రోడ్డుపక్కన బండిమీది చాయ్

మరునాడు అభిమానాన్ని అటకమీద దాచేసి, మరలా అప్పుల భిక్షాటన కోసం బయల్దేరబోతున్నప్పుడు అమిత్ ఆపాడు.

"నాన్నా... మీతో మాట్లాడాలి" అన్నాడు. నా గుండెల్లో రాయి పడింది. ఐనా నిండా మునిగినోడికి చలేమిటని గుండె దిటవు చేసుకుని నిలబడ్డా.

రెండ్రూపాయలకు, కాఫీ మూడ్రూపాయలకు దొరుకుతుందిగా. అక్కడికెళ్ళు' అని అవహేళన చేసి తరిమేసినట్లు బాధ... సుళ్ళు తిరుగుతూ...

ఆకలి ఎప్పుడో చచ్చిపోయింది. ఆశని చంపుకోలేక తెల్సిన ఒకరిద్దరి దగ్గర అప్పు కోసం ప్రయత్నించి విఫలమై యింటికి చేరేప్పటికి సమయం రాత్రి తొమ్మిది దాటింది.

"ఏం జరిగిందండీ అలా ఉన్నారు?" అని అడిగింది సుజాత. అమిత్ భోంచేసి తన గదిలోకెళ్ళిపోయాడని నిర్ధారణ చేసుకుని సుజాతతో అన్ని విషయాలు వివరంగా చెప్పాను. పాపం తనేం చేయగలదు... కన్నీళ్ళ మధ్యలోంచి బూజరగా కన్పించే నా వైపు బాధగా చూట్టం తప్ప...

వారం శెలవ పెట్టి అప్పుల వేటలో పడ్డాను. పంజాబ్ నేషనల్ బ్యాంకువారు ప్రతేడాది కట్టాల్సిన ఫీజు తొంభై రెండు వేలు అప్పుగా యివ్వడానికి ఒప్పుకున్నారు. డొనేషన్ బ్లాక్‌లో యిచ్చేది కాబట్టి తమ వల్ల కాదన్నారు. నాలుగు రోజులు అవిశ్రాంతంగా తిరిగాను. తెల్సిన ప్రతివాడి దగ్గర చేయి చాపాను. రమణ మాత్రం ఓ లక్ష సర్దుతానన్నాడు. అంతే.

ఆ రాత్రి భోజనాల దగ్గర నేనూ సుజాత రెండు దుఃఖాస్రువులుగా మారిపోయాం.

***

మరునాడు అభిమానాన్ని అటకమీద దాచేసి, మరలా అప్పుల భిక్షాటనకోసం బయల్దేరబోతున్నప్పుడు అమిత్ ఆపాడు. "నాన్నా... మీతో మాట్లాడాలి" అన్నాడు. నా గుండెల్లో రాయి పడింది. ఐనా నిండా మునిగినోడికి చలేమిటని గుండె దిటవు చేసుకుని నిలబడ్డా.

"నాన్నా... నిన్న నా ఫ్రెండ్స్‌తో మాటాడాను. కొంతమంది కంప్యూటర్ సైన్స్ తీసుకుంటున్నారట. నాలుగేళ్ళ తర్వాత పరిస్థితి మెరుగుపడ్తుందట. బి.బి.ఐ.టితో పాటు వాసవ్య యింజనీరింగ్ కాలేజీ కూడా మంచిదట. కంప్యూటర్ సైన్స్ కయితే డబ్బులు తక్కువ అడుగుతారట" అన్నాడు. వాడి మాటలు చెవుల్లో అమృతధారల్లా

అన్పించాయి. ఉత్సాహం వచ్చింది. తెల్సిన వాళ్ళ దగ్గర వాకబు చేస్తే బి.బి.ఐ.టిలో ఎంత డిమాండ్ చేస్తారో వాసవ్యలో కూడా అంతే అడుగుతారని, తక్కువ ఏమీ ఉండదని తెల్సుకుని బి.బి.ఐ.టికే వెళ్ళాను. ఆ గదంతా కిక్కిరిసి ఉంది. నా టోకెన్ నంబర్ ఎనభై ఆరు. కౌన్సెలింగ్ తేదీ దగ్గరపడే కొద్దీ మేనేజ్‌మెంట్ సీటు కోసం వెంపర్లాడే వాళ్ళ సంఖ్య కూడా పెరుగుతున్నట్లుంది.

నా వంతు వచ్చాక లోపలికెళ్ళాను. "ఏం నిర్ణయించుకున్నారు?" బి.కె.రెడ్డిగారు అడిగారు.

"ఈసిఈ బదులు కంప్యూటర్ సైన్స్‌లో సీటిప్పించండి" అన్నాను.

"చాలా మంచి నిర్ణయం. ప్రస్తుతానికి కొద్దిగా డల్‌గా ఉన్నా ఫ్యూచర్లో పుంజుకుంటుంది. దాని రేటు ఏడు లక్షలుంది. మీరు మొన్న రిక్వెస్ట్ చేసిన విషయం గుర్తుంది. అందుకే ఆరు లక్షలు కడ్తే చాలు. తొందరగా కట్టండి. లేకపోతే వేరేవాళ్ళకు యివ్వాల్సి వస్తుంది. ఉన్న సీట్లు తక్కువ...వెయిట్ చేస్తున్నవాళ్ళు పది రెట్లున్నారు. తర్వాత మీ ఇష్టం" అన్నాడు.

**సుజాత కొద్దిసేపు మౌనం చాటున బాధని దాచేసే ప్రయత్నం చేసి, విఫలమై, "ఒక పని చేద్దామండి. నా మామిడి పిందెల నెక్లెస్ ఉందిగా. పదిహేను తులాల బంగారం... అమ్మేయండి" అంది. ఆమె గొంతు దుఃఖంతో వణికింది.**

ఆరు లక్షలా... ఓ వైపు డిమాండ్ లేదంటూనే ఆరు లక్షలంటాడేమిటి... కళ్ళు తిరిగినట్లనిపించింది. ఈ మధ్య సరిగ్గా తిండీ నిద్రా లేకపోవటం వల్లనో లేక ఆరు లక్షలుంటుందని వూహించనందువల్లనో...

"వాళ్ళు అలానే అంటారు. కార్పొరేట్ హాస్పిటళ్ళ మాదిరే ఈ కార్పొరేట్ కాలేజీలు కూడా జలగల్లా రక్తాన్ని పీలుస్తున్నాయి. చదువు వ్యాపారమైపోయింది. ఏం చేస్తాం మన ఖర్మ. ఏ యం.యల్.ఏ చేతనో మినిస్టర్ చేతనో రికమెండ్ చేయించు. తగ్గిస్తారు" అన్నాడు నా కొలీగ్.

నాకు రాజకీయనాయకులెవరూ తెలీదు. కాలేజీ రోజుల్నుంచే రాజకీయాలన్నా... గూండాల్లాంటి రాజకీయ నాయకులన్నా అసహ్యం. నా స్టూడెంట్ వాళ్ళ నాన్న యిన్‌కంటాక్స్ కమీషనర్. ఆయన్ని కల్సుకుని, చేతులు జోడించి 'నీవే తప్ప నితఃపరంబెరుగ' అన్నట్లు నిలబడ్డాను.

"ఈ కాలేజీలకి యిన్‌కంటాక్స్ ఎగ్జెమ్షన్ ఉంటుంది. మాట వింటారని అనుకోను. ఐనా చెప్పి చూస్తాను. ఆ తర్వాత మీ అదృష్టం" అన్నాడు.

కమీషనర్‌గారు బి.కె. రెడ్డితో మాట్లాడాక బి.బి.ఐ.టి కెళ్ళాను. ఈసారి నాతో మాట్లాడేటప్పుడు రెడ్డిగారి మొహంలో నవ్వు కన్పించింది. "మీ గురించి యిన్‌కంటాక్స్ కమీషనర్‌గారు చెప్పారు. వారి మాట కాదనలేం. అందుకే రెండు లక్షలు తగ్గిస్తున్నా. వీలైనంత త్వరగా నాలుగు లక్షలు కట్టేయండి" అన్నాడు.

బతుకుజీవుడా అనుకుంటూ బైటపడ్డాను.

నాలుగు లక్షల్లో ఓ లక్ష రమణ సర్దుతానన్నాడు కాబట్టి మిగతా మూడు లక్షల కోసం తీవ్రంగా ప్రయత్నాలు ప్రారంభించాను. నా కొలీగ్ ఒకతను వడ్డీకి డబ్బులిచ్చే వ్యక్తిని పరిచయం చేశాడు. నెలకు నూటికి ఐదు రూపాయల వడ్డీ యివ్వాలన్నాడు. నేనూ నా కొలీగ్ బతిమాలుకున్నాం. దయతల్చి మూడు రూపాయల వడ్డీకి డబ్బులు సర్దుతానన్నాడు.



యింటికొచ్చాక సుజాతకి విషయమంతా చెప్పాను.

"నెలకు మూడు రూపాయల వడ్డీనా... మీరేం చేస్తున్నారో తెలిసే చేస్తున్నారా... వూబిలో దిగబడిపోతామండీ. యిప్పటికే పిల్ల పెళ్ళికోసమని యిల్లు తనఖా పెట్టి తెచ్చిన అప్పుకి వడ్డీ కడ్తున్నాం. యిప్పుడు అదనంగా నెలకు తొమ్మిది వేల వడ్డీ అంటే మీకొచ్చే జీతంలో మనకు తినడానికి ఏం మిగుల్తుంది?" అంది.

"నిజమే. కాని మరో గత్యంతరం లేదుగా సుజీ. నిన్న టివి 9లో న్యూస్ విన్నావుగా. తను కోరుకున్న యింజనీరింగ్ కాలేజీలో చేర్పించడానికి తల్లిదండ్రులు ఒప్పుకోలేదని ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకుంది. నాతోపాటు సోఫాలో కూచుని టీ.వి. చూస్తున్న అమిత్ ఆ న్యూస్ విన్నాక నా వైపు అదోలా చూశాడు తెలుసా? నాకు భయమేసింది. ఆ చూపులో నేను కూడా అలానే చేస్తాను' అన్న భావం కన్పించి రాత్రంతా నిద్రపోలేదు తెలుసా" అన్నాను.

సుజాత కొద్దిసేపు మౌనం చాటున బాధని దాచేసే ప్రయత్నం చేసి, విఫలమై, "ఒక పని చేద్దామండి. నా మామిడి పిందెల నెక్లెస్ ఉందిగా. పదిహేను తులాల బంగారం... అమ్మేయండి" అంది. ఆమె గొంతు దుఃఖంతో వణికింది.

"అదంటే నీకు చాలా యిష్టం కదా. మన పెళ్ళికి మీ వాళ్ళు పెట్టిన నగ. పిల్ల పెళ్ళికి డబ్బు అవసరమైనప్పుడు కూడా దాన్ని వదులుకోడానికి నువ్విష్టపడలేదన్న విషయం మర్చిపోయావా?"

"నిజమే. దాన్ని యిన్నాళ్ళూ నా ప్రాణంలా చూసుకున్నాను. కానీ అమిత్ అంటే అంతకన్నా ఎక్కువ ప్రాణం. మరేం ఆలోచించకండి" అంది అదే చివరి నిర్ణయంలా.

"మనం యికముందు కొన్ని అవసరాల్ని తగ్గించుకోవాల్సి రావొచ్చు. ఖర్చుల విషయంలో ప్రతి క్షణం జాగ్రత్త పడకపోతే యిబ్బంది పడ్తాం సుజీ" అన్నాను.

"నాకు మీరు చెప్పాలా? నేను మీ భార్యనండీ. మనకు కష్టమైనా పర్లేదు. అమిత్ సంతోషంగా ఉంటే చాలు" అంది.

మా యిద్దరి గుండెలు బరువెక్కాయి. గత పదిహేను రోజులుగా బాధ పడ్తున్నట్లే ఆ రాత్రి కూడా నిద్రలేమితో పోరాటం చేసి ఓడిపోయాను. నా జీవితంలో ఓటమి ఓ భాగమై పోయింది.

ఉదయం సుజాత యిచ్చిన మామిడి పిందెల నెక్లెస్ తీసుకుని అమ్మడానికి బయల్దేరబోతుంటే అమిత్ వచ్చాడు. వాడి కళ్ళు ఎర్రగా ఉన్నాయి. తడిగా కూడా ఉన్నాయి. మంచులో తడిసిన ముద్ద మందారాల్లా... కళ్ళవాకిళ్ళకు చీకటి తెరలు చుట్టినట్లు వేలాడుతున్న దిగులు...

వాడి వాలకం చూసి కంగారుపడ్డాను. "ఆరోగ్యం బాగాలేదా... అలా ఉన్నావేమిటి? రాత్రి నిద్ర పోలేదా?" అని అడిగాను.

"నువ్వూ అమ్మా నిద్రాహారాలు మాని నా కోసం మథనపడ్తుంటే నాకెలా నిద్ర పడ్తుంది నాన్నా... రాత్రి మీరు మాట్లాడుకున్న మాటలు విన్నాను. నువ్వు కష్టపడ్తుంటే చూళ్ళేను నాన్నా. అక్క పెళ్ళి కోసం అప్పు చేసిన విషయం నాకు తెలీదు. నన్ను క్షమించు. డబ్బుకి సంబంధించిన విషయాలు పిల్లలకు చెప్పకుండా మీలో మీరు కుమిలిపోతే మాకెలా తెలుస్తుంది నాన్నా? నాకీ మేనేజ్‌మెంట్ సీటొద్దు. కౌన్సెలింగ్‌లో ఏ కాలేజీలో సీటొస్తే ఆ కాలేజీలో జాయినౌతా. నువ్వు డిగ్రీలో చేరమన్నా చేర్తాను నాన్నా... నీ యిష్టం" అన్నాడు. వాడి కళ్ళనిండా నీళ్ళు.

అనాయాసంగా దగ్గరకొచ్చి నన్ను చుట్టుకుని, నా గుండెల మీద తల ఆన్చి ఏడుస్తున్నాడు. నా చొక్కా వాడి కన్నీళ్ళతో తడిసిపోతోంది. నా గుండె నిండా వాడి ప్రేమ నిండి ఒలికిపోతోంది.

వాడు యంసెట్లో మంచి ర్యాంకు తెచ్చుకోవటంలో ఫెయిలయ్యాడేమో కాని తల్లిదండ్రుల్ని ప్రేమించే కొడుగ్గా నూరు మార్కుల్తో పాసైనాడు.

•